విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

అభివృద్ధి పథంలో మొవ్వ మండలం : ఎంపీపీ

విశాలాంధ్ర-కూచిపూడి : మండల పరిషత్ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన రెండు సంవత్సరాలు కాలంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, అధికారులు, సహచర ఎంపీటీసీలు అందించిన సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి పరచడానికి తన వంతు కృషి చేశానని మొవ్వఎంపీపీ కొండేటి ఇందిర పేర్కొన్నారు. మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన అభినందన సభలో పాల్గొని ప్రసంగించారు. రాబోయే మూడు గంటలకు మండలాన్ని పూర్తిగా అభివృద్ధి పరచి ఆదర్శంగా నిలబడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు తోటి సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభినందన సభలో జడ్పీటీసి రావులపాటి పార్వతి, ఎండిఓ జి సుధాప్రవీణ్, తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ లతోపాటు పలువురుఅధికారులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంపీపీ ఇందిరచందు దంపతులను శాలువాలతో పూలమాలలతో సత్కరించారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఈ నెల 25న విజయవాడలో జరుప తలపెట్టిన మహాధర్నాకు ప్రభుత్వం అనుమతి లేదని, మీరు మహాధర్నాలో పాల్గొనకూడదని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి లింగంఫిలిప్‌కు మచిలీపట్టణంలోని చిలకలపూడి పోలీసులు ఇంటికి వచ్చి నోటీసు జారీ చేశారు. ఈ మహాధర్నాలో పాల్గొంటే పోలీసు వారు తీసుకొను చర్యలకు మీరే బాధ్యులవుతారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా పోలీసుల చేత అక్రమ అరెస్టులు, నోటీసులతో ఉద్యమాన్ని ఆపలేరని ఫిలిప్ ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ప్రజలు దీనిని గ్రహించి ప్రభుత్వ ఈ విధానాన్ని ఖండిస్తూ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లింగం ఫిలిప్ మాట్లాడుతూ ఏఐటీయూసీ, సీఐటీయూ న్యూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నెల జీతం తెలంగాణ రాష్ట్రం కన్నా తక్కువ ఇస్తున్నారని జీతాలు పెంచాలని, జగనన్న గోరుముద్ద కార్మికులుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు జీతాలు పెంచి కనీస వేతనం ఇవ్వాలని, విద్యార్థుల మెస్‌ఛార్జీలు పెంచాలని, 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు రోజుకు 8 గంటలు కష్టపడి పనిచేస్తూ గత ప్రభుత్వం హయాంలో అనేక పోరాటాలతో నెలకు రూ.3 వేల వేతనం సాధించుకున్నారు. ఈ ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు నిండినా ఎంతవరకు జీతం పెంచకపోగా జగనన్న గోరుముద్ద పెట్టి మెనూ ఛార్జీలు పెంచకుండా పిల్లలకు పోషక ఆహారం అందిస్తున్నామని, ప్రచారం చేసుకుంటుందే తప్ప రాష్ట్ర వ్యాప్తంగా 86,500 మంది కార్మికులు దీనిలో పనిచేస్తున్నారని సుప్రీంకోర్టు ఆదేశానుసారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న నాయకులను అక్రమ అరెస్టులు చేసి, కార్మికుల హక్కులను నీరుగారుస్తున్నారని, ప్రజలు దీనిని గ్రహించి ప్రభుత్వ ఈ విధానాన్ని ఖండిస్తూ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ఫిలిఫ్ పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను, విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని, సకలాంగులతో తాము సమానమేనని భావించి నిత్యం మనోధైర్యం, ఆత్మవిశ్వాసం హృదయాంతరాలలో నింపుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్ లోని స్పందన సమావేశపు మందిరంలో కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్టిఫిసియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సికింద్రాబాద్ వారి సూచనల మేరకు దివ్యాంగులకు వయోవృద్ధులకు అవసరమైన ఉపకరణాలు అందజేయడం కొరకు గుర్తించబడిన వారికి ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ వెంకటరమణ మాట్లాడుతూ, భారతదేశంలోనే దాదాపు 104 మిలియన్ల మంది సీనియర్ సిటిజన్లు ఉన్నారని, 2026 నాటికి ఈ సంఖ్య 173 మిలియన్లకు పెరుగుతుందని అంచనా ఉందన్నారు. మన దేశంలోని సీనియర్ సిటిజన్లలో 70 శాతం గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చినవారే అని ఆయన పేర్కొంటూ, ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని భారత ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందించిందని. ఆ పథకం 1 ఏప్రిల్ 2017న ఉనికిలోకి వచ్చిందని. ఈ పథకానికి "రాష్ట్రీయ వయోశ్రీ యోజన" అని పేరు పెట్టారని తెలిపారు. అనంతరం సామాజిక న్యాయం,సాధికారిక మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉమేష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, మచిలీపట్నం పార్లమెంటరీ సభ్యులు వల్లభనేని బాలశౌరి అభ్యర్థన మేరకు, పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో 2021 డిసెంబర్ 17 తేది నుండి 30 తేది వరకు దివ్యాంగులకు వయోవృద్ధులకు అవసరమైన ఉపకరణాలు అందజేయడం కొరకు గుర్తింపు శిబిరాలు నిర్వహించబడ్డాయిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో) హైదరాబాద్ ప్రతినిధులు చంద్రకాంత్ గుప్తా, సునీత, కృష్ణాజిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాగ్దేవు కామరాజు, 150 మంది వివిధ ఉపకరణాల లబ్దిదారులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడు ప్రసాద్‌కు కాగిత పరామర్శ

విశాలాంధ్ర-బంటుమిల్లి : సీనియర్ పాత్రికేయులు, ఏపీ యూడబ్ల్యూజె ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు నందిగామ శివ శంకరవరప్రసాద్ త్వరగా కొలుకోవాలని పెడన నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కాగిత కృష్ణప్రసాద్ భగవంతుని ప్రార్థించారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొంది, బంటుమిల్లి స్వగృహానికి వచ్చిన ప్రసాద్‌ను ఆదివారం కాగిత కృష్ణ ప్రసాద్, టిడిపి నాయకులు కార్యకర్తలు పరామర్శించారు. కాగిత వెంట టిడిపి నాయకులు ఇల్లూరి లీలాకృష్ణ, కూనపురెడ్డి వీరబాబు, అంగర రంగనాథ్, జొన్నలగడ్డ కొండలరావు, ఎండి నజీర్, ఆకునూరి రత్నాకర్ తదితరులు ఉన్నారు.

ట్యాబ్స్ సద్వినియోగంపై శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-పమిడిముక్కల: విద్యార్థులకి బైజ్యూస్ ట్యాబ్ ల నిర్వహణ సంబంధించిన సమస్యల పై యు.పి,ఉన్నత పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు నోడల్ ఉపాధ్యాయులు కు జిల్లా నోడల్ అధికారి మొహమ్మద్ దావూద్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉపయోగించే ట్యాబ్ పగిలిపోయినప్పుడు స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేసి గుర్తింపు కార్డు తీసుకోవాలని, ట్యాబ్ పోయినప్పుడు గాని దొంగిలించి సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపి పై అధికారుల కు అందజేయాలని తెలిపారు.ఎస్డి కార్డు కు సంబంధించిన సమస్యలకు యంఐఎస్ కోఆర్డినేటర్ ద్వారా జిల్లా అధికారులు కు తెలిజేయాలని సూచించారు.క్యూర్ కోడ్ స్కాన్ కి సంబంధించిన సమస్యలకు యంఐసి కోఆర్డినేటర్ ద్వారా జిల్లా అధికారులని తెలిజేయాలని ట్యాబ్ లో య్యాప్ లు పనిచేయనపుడు ఫ్యాక్టరీ రీ సెట్టింగ్ చేయాలనే విషయాలు శిక్షణ లో తెలిపారు.ట్యాబుల ఉపయోగం లో ఎదురయ్యే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారించి వీలుకాని సమయంలో అధికారులు కు తెలియజేసి పరిష్కారాలను తెలుసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో యంఇఓ-2 శ్రీనివాస్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని తన పుట్టినరోజు సందర్భంగా స్థానిక శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ అభివృద్ధికి రూ. 50వేల విరాళం అందించారు. ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నాని.. మల్లీశ్వరి దంపతులను ఆలయకమిటీ పెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు, అర్చకులు శశి షణ్ముఖ వరప్రసాద్, ఆలయ కమిటీ పెద్దలు ఉప్పల సుబ్బారావు, యార్లగడ్డ శివయ్య, వెనిగళ్ల బాబూరావు, బి.మధు, ట్యాక్సీ యూనియన్ నేతలు గంజాల రాధాకృష్ణ, ఆత్మకూరి వెంకటేశ్వరరావు, నర్రా చిన్ని, పరిశె రాంబాబు, టీడీపీ నేతలు తాతా ప్రదీప్, అంబటి భువనేశ్వరరావు, వేముల హరికృష్ణ, రావులపల్లి పండు, విశ్రాంత వీఆర్వోలు గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, కొర్రపాటి వీరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్యశిబిరం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉచిత ఆక్యుపంక్చర్ వైద్యశిబిరం జరిగింది. డాక్టర్ జె.వి.ప్రసాద్ వివిధ సమస్యలతో బాధపడుతున్న 50మందిని పరీక్షించి వారికిఆరోగ్యం పట్ల అవగాహన కల్పించి ఉచితంగా వైద్యసేవలు అందించారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు గోళ్ల ద్రోణపూర్ణచంద్రరావు, జూపూడి కిరణ్, నంబూరి శ్రీమన్నారాయణమూర్తి, సాయికుమారి, జ్యోతి, సత్యవాణి సేవలు అందించారు.

పైశాచిక అనందం కొంత కాలమే : రావి

విశాలాంధ్ర-గుడివాడ : స్కిన్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో అవినీతి జరిగిందని అసత్యాలు ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న వైసిపి ప్రభుత్వం ఇది మీ అనందం కొంత కాలం మాత్రమే ఉంటుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం రూరల్ మండలంలోని బొమ్ములూరు గ్రామంలో మండల అధ్యక్షుడు వాసే మురళీతో కలసి కరపత్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ స్కిన్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో అవినీతి జరిగిందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ విషయంలో ప్రజలకు పూర్తిగా అవగాహన కలిగించేందుకు పూర్తి వివరాలతో కరపత్రాలను బొమ్ములూరులో ఇంటింటికి పంచుతూ ప్రచారం నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ శొంటి నాగేశ్వరరావు, బూత్ కన్వీనర్ శొంటి గంగాధర్, రమేష్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

72 గంటల్లో హత్య కేసు ఛేదించారు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం అయ్యంకిగ్రామంలో ఈ నెల 21వ తేదీన జరిగిన భార్యాభర్తల హత్యకేసును కేవలం 72 గంటల్లో పోలీసులు ఛేదించారు. కూచిపూడిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం హత్యకు గురైన వీరంకి వీరకృష్ణ మరియు ముద్దాయిలకు అయ్యంకిగ్రామంలోని మూడు ఎకరాల పొలం ఆస్తి విషయంలో కొన్ని సంవత్సరాలుగా వివాదాలు జరుగుతున్నాయి. తండ్రి వారసత్వంగా వచ్చిన ఈ పొలంలో వీరకృష్ణ ఎకరన్నర, ముద్దాయిలు ఎకరన్నర సాగు చేసుకుంటున్నారు. అయితే ముద్దాయిలు వీరకృష్ణ వాటా ఎకరన్నర కూడా ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తూ పట్టాదారు పాస్ పుస్తకాల కోసం తహశీల్దార్ కార్యాలయంలో అర్జీ పెట్టుకున్నారు. ఈ అర్జీని మూడుసార్లు తిరస్కరించటంతో నాలుగోసారి మరళా దాఖలు చేసుకున్నారు. దీనిపై ఇరువర్గాలను విచారించడానికి తహశీల్దార్ అయ్యంకి గ్రామానికి రావాలని నోటీసులు జారీ చేశారు. అయితే వీరకృష్ణ బతికుంటే అయ్యంకి గ్రామంకు కూడా వెళ్లలేమని ముద్దాయిలు ముందుగానే పక్కాగా ప్రణాళికలు వేసుకునే ఆయుధాలతో గురువారం అయ్యంకి గ్రామానికి వచ్చారు. ఈ విషయంలో పొలం హక్కుదారులపై విచారణ నిర్వహించాలని రెండు వర్గాలను పిలిపించారు. ప్రస్తుతం ముద్దాయిల కుటుంబం పెరవల్లిపాలెం లో నివాసముంటున్నారు. ముద్దాయిలైన వీరంకి గణేష్, వీరంకి నాగలోకేష్, వీరంకి భువనేష్, వీరంకి స్వర్ణలతోపాటు వీరికి సహకరించడానికి వచ్చిన స్వర్ణ అక్క కొడుకు శొంఠి జానేష్ కుమార్‌లు బాపట్ల జిల్లా వేమూరు మండలం పెరవల్లి పాలెం నుంచి అయ్యకి వచ్చారు. వీరు ముందుగానే వేసుకున్న ప్లాన్ ప్రకారం ముద్దాయిలు మృతుడు వీర కృష్ణతో గొడవ పెట్టుకుని వారు తెచ్చుకున్న కత్తులతో నరికి చంపి, అక్కడ నుంచి వెళ్లి వీర కృష్ణ భార్య వరలక్ష్మిని కూడా నరికిపారిపోయారు. హత్య గురైన వీర కృష్ణ దంపతుల కుమార్తె బోయపాటి ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు బృందాలు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. దీనిలో భాగంగానే వీరందరూ కృష్ణాజిల్లాలోని ఘంటసాల మండలం వీరమాచనేనిపాలెం దగ్గర ఉన్నట్టు వచ్చిన సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్‌చేశారు. ఈ సమావేశంలో పామర్రు సీఐ ఎన్ వెంకటనారాయణ, కూచిపూడి ఎస్ఐ డి సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే మా లక్ష్యం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండలంలోని గ్రామాలు అభివృద్ధే యంపిటిసి ల లక్ష్యం మని యంపిపి కాసాని వేద సుప్రజ అన్నారు.ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో యంపిటిసి లు ఎన్నికై రెండు సంవత్సరాల పూర్తైన సందర్భంగా వేడుకగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పూర్తి సహకారం తో మండలంలో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు.వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని అన్నారు అనంతరం యండిఓ చేతులు మీదు అందరికీ జ్ఞాపిక లు అంద జేశారు..ఈ కార్యక్రమంలో యంపిడిఓ విఠల్ పాల్ వైఎస్ యంపిపి కొడమంచిలి మహేష్ గంజాల సీతారామయ్య యంపిటిసి లు యం.సజద్ అలి మరీదు రాజ్యలక్ష్మి జి.వంశి వి.ఆదిశేషు జె.శృతి యం.రాజేశ్వరి వి.మల్లేశ్వరి కె.అంక కుమారి ఇఓపిఆర్డి కె.వెంకటేశ్వర రావు ఎ.ఓ.కె.ఎస్.డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసులు ఎత్తివేయాలి : రావి

విశాలాంధ్ర-గుడివాడ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై పెట్టిన ఆక్రమ కేసులను వెంటనే ఎత్తి వేయాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నారా చంద్రబాబు అక్రమ అరెస్ట్ నిరసనగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 12వ రోజు రిలే నిరహరదీక్షలను టిడిపి అధ్వర్యంలో నిర్వహించారు. దీక్షలు చేస్తున్న నాయకులకు పట్టణా, రూరల్, నందివాడ మండలల అధ్యక్షులు దింట్యాల రాంబాబు వాసే మురళీ, దానేటి సన్యాసిరావులు పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రావి మాట్లాడుతూ చంద్రబాబును విడుదల చేయకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాకరాల సురేష్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు గోవాడ శివా, నాయకులు షయ్యద్ జబీన్, సింగవరపు ప్రభాకర్, షేక్ జానీషరీఫ్, రెడ్డి షణ్ముఖ, కంచర్ల సుధాకార్, మచిలీపట్నం పార్లమెంట్ ఐటిడిపి అధ్యక్షులు ఉప్పలపాటి ప్రవీణ్, గుడివాడ నియోజకవర్గం అధ్యక్షులు సూరపనేని మహేష్, సభ్యులు చలమలశెట్టి వాసు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ రాష్టంలో నియంతృత పాలన

విశాలాంధ్ర-గన్నవరం : జగన్ రాష్టంలో నియంతృత్వ పాలన సాగిస్తున్నాడని మండల టిడిపి అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆదేశానుసారం 12వ రోజు రిలే నిరాహారదీక్షలో భాగంగా జాస్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సూరంపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామ పార్టీ కార్యదర్శి మాజి సర్పంచ్ డి కోటేశ్వరరావు, వైస్ సర్పంచ్ ఈలప్రోలు వాసు, 13వ వార్డు నెంబర్ సుకురాం, మరియదాసు, తిరపతిరావు, బాస్కరావు, అనీల్, టి బాస్కరావు, కోటేశ్వరరావు, రామారావు, రాంబాబు, ఈ శ్రీను , సత్యం, సవారుగూడెం పార్టీ కార్యదర్శి రవికుమార్, మరియు ఉంగుటూరు మండల అధ్యక్షులు ఆరుమళ్ళ కృష్ణారెడ్డి గారి ఆధ్వర్యంలో పుసులూరు లక్ష్మి నారాయణ,యంపిటిసి తుమ్మల నాగశిరోమణి, బడుగు ఝాన్సీ, చిక్కవరపు నాగమణి, బుస్సే సరితా దేవి, శరణ్య శ్రీ దుర్గా, విజయరావు కె సుగుణరావు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

16వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మండలంలోని చినపారుపూడి గ్రామంలో16వరోజు మేము సైతం బాబుతో రిలే నిరాహార దీక్ష ఒకరోజు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్లకుమార్

రాజా ముఖ్య అతిథిగా పాల్గొని దీక్షను ప్రారంభించారు. అనంతరం వర్ల మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ నాయకుల పైన, చంద్రబాబు పైన అక్రమ కేసులు బనాయించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఓటు అనే ఆయుధంతో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని విజ్ఞులైన వాటర్లను రిలే నిరాహార దీక్ష వేదికగా ఆయన ప్రజలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, పామర్రు నియోజకవర్గ బీసీ విభాగం నాయకుడు దానబోయిన వెంకటనారాయణ, నాయకులు కలపాల కిషోర్, గోగం రామారావు, తాతినేని త్రినాథ్, కొడాలి అశోక్ కుమార్, కొడాలి ప్రసాద్, జాజుల రమేష్, చలసాని దివ్య, మహాశక్తి మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర-చల్లపల్లి : జిల్లాస్థాయి చెస్ పోటీల్లో చల్లపల్లి విద్యార్థిని ప్రతిభను చాటి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ, చెస్ అసోసియేషన్, స్కాట్లున్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో కానూరులో జరిగిన చెస్ టోర్నమెంట్ అండర్ 12 విభాగంలో చల్లపల్లి మదర్ థెరిస్సా స్కూల్ 8వ తరగతి విద్యార్థిని గీతార్థ సాయి జిల్లాస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచింది. విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులు అభినందించారు.

నేత్ర దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర-పమిడిముక్కల: పమిడిముక్కలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు వారిచే నిర్వహించిన నేత్ర, దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం జరిగిన వైద్య శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ రవికుమార్, కె.వరలక్ష్మి దంత వైద్య నిపుణులు ఎల్.అనిత రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కంటికి ఆపరేషన్ వారికి తేదీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు సీహెచ్ టి.వెంకటేశ్వరరావు, సభ్యులు పులి శ్రీనివాసరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభినందనలందుకున్న చిన్నారుల కళా ప్రదర్శనలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : జె ఎం ఎస్ నాట్యవేద అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ 18వ వార్షికోత్సవ వేదికపై కామ్రేడ్ జి ఆర్ కె పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి సహకారంతో ఆదివారం సాయంత్రం సిద్దార్థ ఆడిటోరియం లో దాదాపు 130 మంది నాట్యవేద విద్యార్థులచే జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు వారి వారి కృషికి దర్పణంగా సాగాయి. జంగం సోదరీమణులుగా పేరు గడిస్తున్న నాట్యాచారిణీలు మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తుల నృత్య దర్శకత్వంలో దాదాపు 100 మంది చిన్నారులు పలుకు తేనెల తల్లి, జగదానందకారక, రామాయణ శబ్దం తదితర అంశాలను రమణీయంగా ప్రదర్శించారు. ప్రారంభం లో 21 మంది చిన్నారులచే వాగ్గేయకారుల కృతులు, కీర్తనలు, సంకీర్తనలతో శాస్త్రీయ సంగీత కచేరి జరిగింది. సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి, పసుమర్తి హరినాథశాస్త్రి లు వారిదైన అపార అనుభవాన్ని చాటుతూ సహకరించారు. తదుపరి 8 మంది చిన్నారులు భగవద్గీత 7, 8, 9 అధ్యాయాలలోని విజ్ఞాన, అక్షర పరబ్రహ్మ, రాజయోగ, రాజగుహ్య యోగములు చదివి వినిపించారు. వ్యాఖ్యాతగా జంగం శ్రీనివాస చక్రవర్తి వ్యవహరించగా నిర్వహణ చేశారు. రచయిత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతోద్యోగి డాక్టర్ ఎం ప్రభాకర్, శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ బేతిరెడ్డి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కళలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయని అంటూ చిన్నారులను ప్రశంసించారు.

అనాధ వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మాతృ దేవో భవ వృద్ధాశ్రమం లోని వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భముగా సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ మాట్లాడుతూ ఇలా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలా తమ తమ ఇళ్లలో జరిగే శుభకార్యాల సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు మానసిక వికలాంగులకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి వారికి అండగా నిలవాలని కోరారు. అన్నదానం చిన్నారి తిగళ్‌త పుట్టిన రోజు పురస్కరించుకుని అన్నదానం నిర్వహించిన వారి తాత గిరిధర్ ఇందిర, తల్లిదండ్రులు మానస, సతీష్‌కుమార్‌లు సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాముకు ధన్యవాదాలు తెలిజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌రే సంస్థల కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, మాతృదేవోభవ వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు
మోదీ ఎన్నికల జిమ్మిక్కే

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : అర్థంతరంగా పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయడం, త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్టిలో పెట్టుకొని మోదీ చేసిన ఎన్నికల జిమ్మిక్కేనని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. రెడ్డిగూడెం మండలం తాడిగూడెం-వెలగలగూడెంలలో ఆదివానం జరిగిన మహిళ సమావేశంలో కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ దేశంలో తొమ్మిది సంవత్సరాల నుంచి మహిళలకు మాన ప్రాణాలకు రక్షణ కల్పించడంలో వారి హక్కులు కాపాడటంలో ఏమాత్రం చిత్తశుద్ధి కనబరచని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రతిక్షాలన్నీ ఏకత్రాటిపైకి వచ్చి ఏర్పాటు చేసిన ఉప్పెనకు పీఠకదులుతున్న దశలో గతంలో మహిళా బిల్లు వ్యతిరేకించిన బీజేపీ ఇప్పుడు కపట ప్రేమవలకబోస్తూ బిల్లును ప్రవేశపెట్టినట్లే పెట్టి 10 సంవత్సరాల తరువాత ఇది అమలు సాధ్యమని చెప్పడం, ఈ మహిళ రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో ప్రజలు అర్థం చేసుకోలేని అమాయకులు కారని అన్నారు. 2024 ఎన్నికలలో బీజేపీని చిత్తు చిత్తుగా ఒడించి తీరుతారని కోటేశ్వరరావు స్పష్టం చేశారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దారుణ మారణకాండపై నోరు మెదపని మోదీ బీజేపీ పాలకుల నిజస్వరూపాలెంటో ప్రజలంతా క్షుణంగా చూస్తునే ఉన్నారని అన్నారు. ఎన్ని గారడీలు ప్రయోగించిన బీజేపీవి శూన్యమేనన్నారు. సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుద్ది రమేష్, స్థానిక నాయకులు దిరిశనపు బుడ్డాయి, జన్ని బాలయ్య పాల్గొన్నారు. మహిళా నాయకులు సందిపాము గోవర్ధనమ్మ, గద్దల సుబ్బులు, సగ్గుర్తి రజని, సగ్గుర్తి సంతోషం, సగ్గుర్తి వెంకమ్మ, దిరిశనపు భారతి, దామందుల సోవమ్మ, తదతరులు నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-నందిగామ: చట్టాలపై ప్రతి ఒక్కరుకి అవగాహన ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.కె రియాజ్ పేర్కొన్నారు. నందిగామ భవన కార్మికుల భవన కార్యాలయంలో ఆదివారం మండల న్యాయ సేవాది కార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నందిగామ మండల భవన కార్మిక సంఘం అధ్యక్షుడు షేక్ పితాన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో న్యాయమూర్తి రియాజ్ పలు కార్మిక చట్టాల గురించి తెలిపారు. ఈ సదస్సులో న్యాయవాదులు బొందలపాటి రామకృష్ణ, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, వెంకటరత్నం శివాని భవన కార్మిక సంఘం సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తే సరి! లేదంటే లేదు..

-శవాలపై పైసలేరుకుంటున్న ఓ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్
-43వ డివిజన్ శానిటేషన్‌లో అవినీతి అక్రమాలు
-సోదరుని మరణంతో సెలవు పెట్టిన కార్మికుడిని వదలని వైనం
-కళ్లు తెరకపోతే స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రభావం
-పరిశీలించి చర్యలు తీసుకుంటా-సీఎంవోహెచ్

విజయవాడ నగరపాలక సంస్థలో ఓ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అవినీతి హవాకు హద్దేలేకుండా పోతోంది. తనకు అనుకూలంగా ఉండే కార్మికులు, పైసలిచ్చే కార్మికులు సక్రమంగా పని చేయకపోయినా తూతూ మంత్రంగా పనిచేస్తున్నా పట్టించుకోడు. ఈయన పని దొంగలు పని చేయకపోయినా వారిని వెనకేసుకురావటంతో ఆ పని భారం కూడా పని చేసే కార్మికులపై పడుతోంది. వీటిని ప్రశ్నించే కార్మికులకు సదరు ఇనస్పెక్టరు చుక్కలు చూపిస్తాడని డివిజన్‌లోని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఇటీవల ఓ కార్మికుడు తన సోదరుడు మరణించి 15 రోజులు సెలవు పెడ్డాడు. సెలవులు అనంతరం సదరు కార్మికుడు విదుల్లో చేరేందుకు రాగా రూ.2 వేలిస్తేనే విదులకు అనుమతిస్తానని కరాకండిగా చెప్పారు. దీంతో అవాక్కయిన కార్మికుడిపై అధికారులకు నేను విన్నవించుకుంటానని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను ప్రాదేయపడినా ససేమిరా అంటూ రూ. 2 వేలిస్తే రా లేదంటే లేదని విదులకు అనుమతించకపోవటంతో పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. సదరు ఇన్‌స్పెక్టర్ కొన్నేళ్లుగా అడిగినంత మామూళ్లు ఇస్తే పని, లేదంటే లేదు.. ఇదే పరిస్థితి కొనసాగితే స్వచ్ఛ సర్వేక్షణ్‌పై తీవ్ర ప్రభావం పడి ర్యాంకింగ్‌లో నగరం మరింత దిగజారే పరిస్థితి లేకపోలేదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికాదికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

హద్దేలేని అక్రమాలు :

43వ డివిజన్ పారిశుధ్య విభాగంలో అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల ఓ కార్మికుడు జూలై 30వ తేదీన తన సోదరుడు మరణిస్తే 15 రోజులు సెలవు పెట్టాడు. సెలవు ముగిసిన అనంతరం తిరిగి కార్మికుడు ఆగస్టు 15వ తేదీన విదులకు హాజరయ్యాడు. కానీ సదరు ఇన్‌స్పెక్టర్ రూ. 2వేలు ఇస్తేనే పనికి అనుమతిస్తానని బేరం పెట్టటంతో సదరు కార్మికుడు అవాక్కయ్యాడు. సోదరుడు చనిపోయి బాదల్లో ఉండటంతో పాటు 15 రోజులు పని చేయక వేతనం రాక ఇబ్బందుల్లో ఉన్నాను, నేను ఇచ్చుకోలేనని ప్రాదేయపడినా కనికరించలేదని, అప్పటి నుంచి నేటి వరకు పనిలోకి రానివ్వకపోవటం ఆయన అక్రమాలు ఏ స్తాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అందరూ ఉదయం 5.30 గంటలకు మస్తరు దిగితే ఆయన అనుంగులు మాత్రం 10.30 గంటలకు మస్తరు దిగటం ఆశ్చర్యం. డివిజన్‌లో చెత్త సేకరణకు వినియోగించే నాలుగు ఆటోల నుంచి నెలకు ఒక్కో దానికి రూ.3వేలు మామూళ్లు ఇవ్వాలని, లేకుంటే కుంటి సాకులతో పై అధికారులను తప్పుదారి పట్టించి వేధింపులకు గురి చేస్తారని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లో తనకు అనుకూలంగా ఉండే శానిటేషన్ కార్మికులచేత హోటళ్లు, హాస్పటల్స్ వద్ద నెలనెలా మామూళ్లు, చికెన్, మటన్ దుకాణాల వద్ద వారం వారం మామూళ్లు వసూలు చేయిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

స్వచ్ఛ్ సర్వేక్షణ్‌పై ప్రభావం

నగర పాలక సంస్థ అధికారులు, నగర ప్రజలు మొత్తం ప్రస్తుతం ఇండియన్ స్వచ్ఛత 2.0 కార్యక్రమంలో నిమగ్నమై ఉంటే 43వ డివిజన్‌లో మాత్రం ఇదేమీ పట్టటంలేదు. సదరు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ స్వలాభం కారణంగా ఇండియన్ స్వచ్ఛత కార్యక్రమానికి తూట్లు పడుతున్నాయని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వేధింపులు, తాడ్చిడితో పాటు 30 మంది చేయాల్సిన పనిని సగం మంది కార్మికులే చేయటంతో పని భారం పెరిగి 10 నుంచి 15 మంది కార్మికులు గైర్ హాజరువుతుంటారని పేరు చెప్పేందుకు ఇష్టపడని పలువురు కార్మికులు చెబుతున్నారు. డివిజన్‌లో శానిటేషన్ పరిస్థితి అస్థవ్యస్తంగా ఉన్నా పై అధికారులకు పట్టకపోవటంపై ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

43వ డివిజన్ శానిటేషన్ విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళిని విశాలాంధ్ర ప్రతినిది వివరణ కోరగా ఇప్పటి వరకూ తన దృష్టికి రాలేదని దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కార్మికుడు స్వయంగా తన వద్దకు వచ్చి సమస్యను వివరిస్తే పరిశీలించి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు.

-సీఎంహెచ్‌వో పీ.రత్నావళి

వందేభారత్ రైలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ రైల్వేస్టేషన్ అత్యంత కోలాహాల మధ్య బయలుదేరింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించగా విజయవాడ రైల్వే స్టేషన్ లో కేంద్ర ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్, స్థానిక ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర మేయర్ రాయని భాగ్యలక్ష్మి, డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ కేవలం 9 నెలల వ్యవధిలో ఆంధ్రప్రదేశ్‌కు మూడో వందేభారత్‌ను అందించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర రైల్వేశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ స్వదేశీ సెమీ హైస్పీడ్ రైళ్లలో ఇప్పటి వరకు 1 కోటి మందికి పైగా ప్రయాణించారని పేర్కొన్నారు. దేశాన్ని అన్ని రకాలుగా స్వయం ఆధారిత స్వయం సుస్థిరతతో తీర్చిదిద్దాలన్న ప్రధాని యొక్క గొప్ప దృక్పథాన్ని ప్రశంసించారు. రైలు ప్రయాణం రైలు మౌలిక సదుపాయాల నవీకరణకు సంబంధించి 2023 ఒక ముఖ్యమైన సంవత్సరంలో ఒకటిగా నిలుస్తుందన్నారు వందే భారత్- భారతదేశం యొక్క నిజమైన గర్వం కారణమన్నారు. డీఆర్ఎం మాట్లాడుతూ విజయవాడ చెన్నైలోని రెండు ప్రధాన దక్షిణ రాజధానుల మధ్య ఈ రైలు పవిత్రమైన పుణ్యక్షేత్రం తిరుపతిని (రేణిగుంట మీదుగా) వెళ్తుందన్నారు. ఎంతోకాలంగా ప్రయాణికులు ఎదురుచూసిన ప్రతిష్టాత్మకమైన కల అన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలతో వందేభారత్‌కు స్వాగతం పలికారు. సాంస్కృతిక ప్రదర్శనకారులతో పాతశాల పిల్లలు దిగ్గజ స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలను ధరించారు. పెద్దఎత్తున 'భారత్ మాతా కీ జై' నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎడిఆర్ఎం డి శ్రీనివాసరావు, ఎడిఆర్ఎం, ఆపరేషన్స్, రైల్వే సీనియర్ అధికారులు ఎం. శ్రీకాంత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ ఖాజాకు సన్మానం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఖాజాకు ఘన సన్మానం జరిగింది. ఈనెల 9వతేదీన జరిగిన రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ (ముతావల్లి కోటా)గా షేక్.ఖాజా ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆదివారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భవానీపురంలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ నేతలు ఆయనకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహూల్లా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయర భాగ్యలక్ష్మీ, దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, వైసీపీ నేతలు ఖాజాకు ఘనంగా సన్మానించారు.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కోటయ్యనాయక్

విశాలాంధ్ర-మైలవరం: ప్రతిష్టాత్మకంగా నిర్వహించ బడిన 2300 ఎకరాల కనిమెర్ల-పర్వతాపురం భూపోరాటాలలో చురుకైన నాయకునిగా, కమ్యూనిస్టు పార్టీ యెడల, కమ్యూనిస్టు ఉద్యమం యెడల అంకితభావంతో పనిచేసిన నిబద్దతగల కమ్యూనిస్టు నాయకుడు అమరజీవి బాణావత్ కోటయ్యనాయక్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు నివాళులు అర్పించారు. మైలవరం మండలంలో పోరాటనగర్‌లో ఈ నెల16వ తేదీన తీవ్రమైన అనారోగ్యంతో మరణించిన బాణావత్ కోటయ్య నాయక్ సంస్మరణ సభలో సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుద్ది రమేష్‌లు పాల్గొని కోటయ్య నాయక్ చిత్రపటానికి పులమావేసి సీపీఐ తరపున ప్రగాఢ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ కార్మిక, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో ఉధృతంగా సాగిన భూపోరాటాలతో ప్రారంభమై ఈ ఉద్యమైన 1991లో ఆ పోరాటకేంద్రాలోనే నివాసాలు ఏర్పాటు చేసుకుని ప్రస్తావంలో భాగస్వామియై, ఎర్రజెండా, కమ్యూనిస్టు పార్టీ పట్ల అచంచలమైన విశ్వాసంతో తన కుటుంబం మొత్తాన్ని కమ్యూనిస్టు లుగా తీర్చిదిద్దిన ఆదర్శ నాయకుడు కోటయ్య అని కొనియాడారు. పేద ప్రజల అభ్యున్నతికోసం జరిగిన అన్ని ఉద్యమాల్లో తనతో పాటు భార్య, పిల్లలను కూడా నడిపించారని తెలిపారు. భార్య తులశమ్మ, కుమారుడు శివయ్య నాయక్, కుమార్తెలు రంగమ్మ, గౌరీలు నమ్మిన పార్టీ, జెండావిలువలు కాపాడుతూ నిజమైన కమ్యూనిస్టు తమ జీవనప్రస్తావం కొనసాగించడం గొప్ప విషయం అన్నారు. కోటయ్య ఆదర్శాలను విస్మరించకుండా స్మరించుకుంటూ ఉద్యమ బాటలో నడవటం ఆయనకు అర్పించే నిజమైననివాళులన్నారు. స్థానిక సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు బాణావత్ పెదబాలునాయక్, అంగోతునాగునాయక్ ,బి కృష్ణానాయక్, బి అయ్యా నాయక్, కె రత్నకుమారి , ఎస్ నాగేష్ లతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించండి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ఆరుగురు మిత్రులు మంచి ఆలోచనతో మొట్టమొదటిసారి జటాయి క్యారవాన్ నగర ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన యువతను ప్రోత్సహించి, క్యారవాన్ ను ఆదరించాలని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు కోరారు. సినీ, సీరియల్, షార్ట్ ఫిలిం నిర్మాణాలకు సంబంధించి వినియోగించే జటాయు క్యారవాన్ ను ఆదివారం గాంధీజీ మున్సిపల్ హై స్కూల్ ప్రాంగణంలో పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించి, అనంతరం మాట్లాడుతూ పరిమి సునీల్ కుమార్, వక్కల గడ్డ నాగప్రసాద్, శివరాం శ్రావణ్ శివరాం వంశీ, కొలిపాకుల వినయ్ కుమార్, సాదు అనుదీప్, ఈ ఆరుగురు మిత్ర బృందం కలిసి ఎవరి మీద ఆధారపడకుండా నూతన ఆలోచనలతో ఐక్యంగా కలిసి పనిచేయటం సమాజానికి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో 37 వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, శ్రీ వెంకటేశ్వర మోటో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకుల స్నేహితులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి వికృతచేష్టలతో రాష్ట్రం అధోగతి

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ పట్టణం రైతుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆదివారం నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ, నారా చంద్రబాబునాయుడుని వెంటనే విడుదల చేయాలని 'బాబు కోసం మేము సైతం' అంటూ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలలో భాగంగా 12వ రోజు కొనసాగింది. రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ రైతునేతలకు జనసేన నేతలు మరియు స్థానిక తెదేపా నేతలతో కలిసి దండలను వేసి దీక్షను ప్రారంభించి వారి దీక్షకు సౌమ్య సంఘీభావం తెలిపారు. ఎక్కడ చూసినా అరాచకాలు, అన్యాయాలు రాజారెడ్డి రాజ్యాంగాలు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు తీవ్రంగా ఖండిస్తున్నారు.

అరెస్టుకు నిరసనగా టిడిపి పాదయాత్ర

విశాలాంధ్ర-కంచికచర్ల: చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసిస్తూ మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మాదాసు సురేష్ ఆధ్వర్యంలో బత్తిన పాడు గ్రామం నుంచి పరిటాల ఆంజనేయ స్వామి టెంపుల్ వరకు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర చేపట్టిన వారికి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కోగంటి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కక్ష పూరిత ధోరణితోనే చంద్రబాబు నాయుడును అరెస్టు కు పూనుకున్నారన్నారు. వైసిపి వారు ఇన్ని ఎత్తుగడలు వేసిన చంద్రబాబు కడిగిన ఆణిముత్యం లా బయటికి వస్తారని కోగంటి తెలియజేశారు. చంద్రబాబు నాయుడు ను వెంటనే విడుదల చేయాలని దేశం శ్రేణితో కలిసి కోగంటి బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిన పాడు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛత సేవలో స్వచ్ఛందంగా...

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్వచ్ఛత సేవలోప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనటం అభినందనీయమని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. 62 డివిజన్ రాధానగర్‌లో స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి, 35వ డివిజన్ కార్పొరేటర్ బాలసాని మణిమ్మ, 45వ డివిజన్ కార్పొరేటర్ ఎం.లావణ్య, 8వ డివిజన్ అశోక్ నగర్‌లోని అపార్ట్మెంట్ వాసులు, 39వ డివిజన్ షాదిఖానా రోడ్ భవానిపురంలో సీఎంఓ.హెచ్ డాక్టర్ పీ.రత్నావళి వారి బృందంతో ఆదివారం స్వచ్ఛత ఈ సేవ అంటూ ఆయా డివిజన్లులో చీపుర్లు పట్టుకుని పరిసరాలను శుభ్రపర్చారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో 100కుపైగా మొక్కలు నాటారు. పెరుగుతున్న జనసాంద్రతకు మొక్కలు, చెట్లు ఎంతో ముఖ్యమైనవని గుర్తించి స్థానికులు ముందుకు వచ్చి స్వచ్ఛత సేవలో పాల్గొని జయప్రదం చేశారు.

ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - గుంటూరు: బేగుసురాయిలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ 30వ జాతీయ మహా సభలు జయప్రదం చేయాలని ఆదివారం గుంటూ రు నగరంలో మల్లయ్య లింగం భవన్ నందు జాతీయ మహాసభల వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వం రెండవసారి అధికా రంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు పెద్దపీట వేస్తానని ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నమ్మబలికి అధికారం లోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్న 18 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. దేశంలో జాతీయ నూతన విద్యా విధానాన్ని తీసుకొని వచ్చి విద్యను పూర్తిగా కాషాయీకరణ చేసే పద్ధతుల్లో వ్యవహరిస్తున్నా రని మండిపడ్డారు. తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే విద్యార్థులకు పెద్దపీట వేస్తానని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చినాక విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చడానికి కుట్ర పన్నా రని తెలిపారు.. వైద్య విద్యార్థులను విద్యకు దూరం చేసే పద్ధతుల్లో జీవో నెంబర్ 107, 108 తీసుకొని వచ్చి సెల్ఫ్ ఫైనాన్స్ ఎన్నారై కోటాలో విద్యార్థులను చేర్చుకొని రాష్ట్ర ప్రభుత్వానికి 165 కోట్లు లాభం చేకూర్చే విధంగా జీవోలను తీసుకొని వచ్చి ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులను పూర్తిగా అన్యాయం చేస్తున్నా రని మండిపడ్డారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ , కాస్మోటిక్ చార్జీలు పెంచాలని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథ కాన్ని అమలు చేసి జూనియర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బోధన, బోధ నేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాల యంలో ఖాళీగా ఉన్న 5045 ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాల న్నారు. ఉన్నత చదువులు చదవడానికి విద్యార్థులను దూరం చేసే పద్ధతుల్లో తీసుకు వచ్చిన జీఓ నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పైన చర్చించి భవిష్యత్తు కార్యచరణ శ్రీకారం చుడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ఏశ్వంత్, సాయి, అమరనాథ్, బన్నీ పాల్గొన్నారు.

'శారద'లో 'ప్రెషర్స్ డే' సందడి

విశాలాంధ్ర-విజయవాడ (ఎడ్యుకేషన్) : విజయవాడ, మొగల్రాజపురంలో ఉన్న శారద విద్యా సంస్థల" ప్రెషర్స్ డే" సెలబ్రేషన్స్ కన్వెన్షన్ హాల్లో ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సభకు ముఖ్య అతిథిగా పి. సునీల్ (డిప్యూటి డైరెక్టర్, సిస్టమ్స్ రిలయబిలిటీ,) మరియు డాక్టర్ వి. రాధికారెడ్డి (రిజిస్ట్రార్ డాక్టర్. వై.యస్.ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్) గౌరవ అతిథిగా విచ్చేశారు. సభాధ్యక్షులు కళాశాల చైర్మన్, డాక్టర్ వై రమేష్ బాబు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం తమ కళాశాల విద్యార్థులకు విశిష్ట వ్యక్తులను పరిచయం చేసి అమూల్యమైన సందేశాలతో విలువైన సమాచారాన్ని అందిస్తూ " ప్రెషర్స్ సెలబ్రేషన్స్" ఎంతో ఘనంగా జరుపుకుంటామని తెలిపారు. గడచిన 8 సంవత్సరాలనుండి కేవలం స్కాలర్స్ విద్యా సంస్థగానే, తమ విద్యార్థులు నుండి అత్యుత్తమ ఫలితాలను సాధించి, మంచి మెడికల్ మరియు ఇంజనీరింగ్ కాలేజీలలో సీట్లు సంపాదించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పి. సునీల్ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, షార్ - శ్రీహరికోటకు మూడు దశాబ్దాలుగా సాంకేతిక నిపుణునిగా పనిచేస్తూ తన వంతు సహాయసహకారాలతో చంద్రయాన్-3 మరియు ఆదిత్య యల్-1 పని తీరును, ఎప్పటికప్పుడు ఎంతో నైపుణ్యంగా ప్రపంచం మొత్తానికి తెలియపరిచారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పి. సునీల్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందంటూ, దేశాభివృద్ధి సాధించాలంటే ముందు మనం మారుతూ, సమాజాన్ని మార్చాలని, ప్రతి ఒక్కరు ధృడసంకల్పంతో ఉండాలని కోరారు. విద్యార్థి ఉజ్వల భవిష్యత్తును రూపొందించే కేంద్రాలుగా ఉన్నటువంటి కళాశాలలను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా సద్వినియోగపరుచుకుని, ఉన్నత విద్యలతో మహోన్నత పదవులను అధిరోహించి, ధర్మబద్ధతతో కూడిన సేవలను సమాజానికి అందించాలని సూచించారు.గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ వి. రాధికారెడ్డి, ఎండి (వై.యస్.ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్) మాట్లాడుతూ విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న విద్యా వనరులను ఉపయోగించుకుని, పాఠ్యప్రణాళికలను క్రమం తప్పకుండా సాధన చేసుకోవాలని, అధ్యాపకులను చక్కగా వినియోగించుకుని, ఎటువంటి మానసిక ఒత్తుడులకు లోను కాకుండా తమ లక్ష్యాన్ని సాధించుకోవాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, భావవ్యక్తీ కరణ, వివిధ నైపుణ్యాలు కల్గి ఉంటే భవిష్యత్తులో బాగా రాణిస్తారు. దానికి ప్రెషర్స్ లాంటివి మంచి వేదికగా ఉపయోగించుకోవాలి అన్నారు.తమ కళాశాల విద్యార్థులకు అన్ని రకాల ప్రవేశ పరీక్షలు వ్రాసే విధంగా ఎప్పటికప్పుడు నూతన విద్యాప్రణాళికలతో, విద్యా భోదనలతో, క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని, పిల్లల చదువు, వారి భవిష్యత్తు విషయంలో తల్లిదండ్రుల పాత్రను తెలియజేయడానికి తల్లిదండ్రుల సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులను కేవలం చదువు విషయంలోనే కాకుండా, వారికి ఆసక్తి గల క్రీడా రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి సంవత్సరం స్పోర్ట్స్ మీట్లు నిర్వహిస్తున్నామని, సాంస్కృతిక రంగాలలో కూడా వారికి పాల్గొనే అవకాశం కల్పించటం కోసం ప్రెషర్స్ డే వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధికి వెన్నుతట్టి ప్రోత్సాహిస్తున్నామని కళాశాల అడ్వైజర్ ఈ.యస్.ఆర్.కె.ప్రసాద్ తెలిపారు.జెఇఇ మెయిన్-జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటీ ఇండోర్లో చదువుతున్న యమ్ తేజో రామ విఘ్నేశ్వర్కు, నీట్లో ఉత్తమ ర్యాంకు సాధించి గుంటూరు మెడికల్ కాలేజీలో చేరిన టి. భావనకు కంఠమనేని బాబు రాజేంద్రప్రసాద్ మెమోరియల్ గోల్డ్ మెడల్సు గౌరవ అతిథులు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా, తమ ఆట పాటలతో "ప్రెషర్స్ డే" ను మరింత సందడి చేస్తూ సభాప్రాంగణాన్ని అలరించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ వై రమేష్ బాబు యమ్.డి వై శారద దేవి "ప్రెషర్స్ డే" వేడుకలకు సహకరించిన విద్యార్థిని, విద్యార్థులకు, అధ్యాపక బృందానికి , తదితర సిబ్బందికి కృతజ్ఞతలు తెలియచేశారు.

ఒబా అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ఒబా అసోసియేషన్ డివిజన్ ద్వితీయ సర్వసభ్య సమావేశం సకాలంలో హాజరై జయప్రదం చేసినందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలియజేసిన ఒబా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి ఎం డి షాహిన్, ఏ శ్యామల. ఓబ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిండికేట్ బ్యాంక్ కాలనీ రాకేష్ పబ్లిక్ స్కూల్ వద్ద ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాకేష్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ అధినేత ఎన్ వి రావుకు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా నిర్వాహకులు సన్మానం చేశారు. సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు పి విజయలక్ష్మి, పి మురళీధర్, చక్రధర్, ఎస్ కే జిలాని, యుగంధర్ ఆచార్యులు, దుర్గారావు, శ్యాంసుందర్, బేగం, ఈశ్వరరావు, ఉషారాణి, బాబురావు, సాంబశివరావు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన పశువుకు శస్త్ర చికిత్సలు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక బంటుమిల్లిరోడ్డులోని ముబారక్ సెంటర్లో రోడ్లపై ఉండే పశువును గుర్తు తెలియాని వాహనం ఢీ కొనడంతో తీవ్ర రక్తస్రావం తో రక్తపు మడుగులో ఉన్న పశువును జనసేన నాయకుడు డా॥ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అధ్వర్యంలో పశువైద్యులచే శాస్త్రచికిత్స చేసి రక్షించడం పట్ల పలువరు ఆర్కె కోనయాడారు. ఆదివారం రక్తమడుగులో ఉన్న పశువుకు వైద్యులచే జనసేన నాయకుడు ఆర్కె వైద్యం చేయించడం గొప్ప విషయమాని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆర్కె మాట్లాడుతూ నోరులేని మూగజీవాలను రోడ్లమీద వదిలివేయడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్తచెదారం తినడం జరుగుతుందన్నారు. పశువులు రోడ్లు మీద సేద తీరడంతో ప్రజలకు, వాహనదారులకు కూడా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. పశువుల యాజమానులకు మున్సిపల్, పోలీసు శాఖ కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. పశువైద్య అధికారులు డా॥ దివాకర్, డా॥చింతయ్యలు స్పందించి పశువుకు వైద్యం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐకానిక్ బకెట్‌ను మార్చిన కేఎఫ్‌సి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవాన్ని పురస్కరించుకుని, కెఎఫ్‌సి ఇండియా భారతీయ సంజ్ఞల భాషపై అవగాహన పెంచేందుకు తన అత్యంత విలక్షణమైన బ్రాండ్ ఆస్తి, ఐకానిక్ బకెట్‌ను ఉపయోగిస్తోంది. ప్రత్యేకంగా రూపొందించిన సైన్ లాంగ్వేజ్ బకెట్ ద్వారా సాధారణంగా ఉపయోగించే పదాలు మరియు పదబంధాల దశల వారీ విజువల్ ట్యుటోరియల్‌లను అందిస్తోంది. భారతీయ సైన్ లాంగ్వేజ్ లో ఎలా కమ్యూనికేట్ చేయాలో తెలుసుకునేందుకు ఇది వినియోగదారులకు అవకాశం కల్పిస్తుంది. హలో, ప్లీజ్, గుడ్ మార్నింగ్, ఎలా ఉన్నారు, హ్యావ్ ఎ గుడ్ డే, లోల్, వాట్స్ అప్? వంటి పదాలతో పాటు సంఖ్యలు, పరిమాణాన్ని బకెట్‌పై ప్రధానంగా పొందుపరిచారు. ప్రత్యేకంగా రూపొందించిన సైన్ లాంగ్వేజ్ బకెట్లు ఈ వారం నుంచి భారతదేశంలోని అన్ని కెఎఫ్‌సి రెస్టారెంట్లలో అందుబాటులో ఉంటాయి.

భూషణగూళ్ళలో అన్న సమారాధన

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని భూషణగూళ్ల గ్రామంలో వీరమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో వినాయకుని విగ్రహానికి భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం వందల సంఖ్యలో అన్న సమారాధన విగ్రహ కమిటీ వారిచే నిర్వహించడం జరిగింది. తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల కోరికలు తీర్చే వినాయకుడిగా ఉన్న దేవుడని నమ్ముతున్నామని అన్నారు. చెరసాలలో ఉన్న చంద్రబాబుపై మీ ఆశీస్సులు కుమ్మరించి తనకు ఏ నష్టం, కష్టం లేకుండా త్వరగా బయటకు వచ్చే విధంగా దీవించాలని వర్ల కుమార్ రాజా వినాయకుడిని వేడుకున్నారు. చంద్రబాబు కోసం భక్తులు అన్ని దేవాలయాలలో ప్రార్థనలు ప్రత్యేక పూజలు నిర్వహించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వినాయకుని భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ అంతర జిల్లాల రెజ్లింగ్

-అండర్ - 14 బాలుర చాంపియన్‌షిప్ కృష్ణాజిల్లా కైవసం

-బాలికల విభాగంలో సత్తా చాటిన చిత్తూరు జిల్లా

-అండర్ - 17 బాల బాలికలలో నెల్లూరు, విశాఖ జిల్లాల హవా

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్: మూడు రోజులపాటు ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్న వికాస్ విద్యాసంస్థల ఆవరణలో నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్ - 14, 17 విభాగాల బాలబాలికల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో అండర్ - 14 బాలుర టైటిల్‌ను ఉమ్మడి కృష్ణాజిల్లా కైవసం చేసుకుంది. రెండు బంగారు పతకాలతోపాటు నాలుగు రజత, రెండు కాంస్య పతకాలతో బాలుర జట్టు 160 పాయింట్లు సాధించి ప్రథమస్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అలాగే బాలికల విభాగంలో చిత్తూరు జట్టు చాంపియన్‌గా నిలవగా, అండర్ -17 బాలుర టైటిల్‌ను నెల్లూరు జిల్లా, బాలికల చాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం జిల్లా కైవసం చేసుకున్నాయి. హోరాహోరీగా సాగిన రెజ్లింగ్ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. రెజ్లింగ్ క్రీడాకారులు గెలుపు కోసం హోరా హోరీగా పోరాడటంతో శనివారం తెల్లవారుజాము రెండు గంటల వరకు మ్యాచ్‌లు జరిగాయి. ఆ తర్వాత జరిగిన ముగింపు కార్యక్రమంలో చాంపియన్‌షిప్‌లతోపాటు విజేతలకు పతకాలను వికాస్ విద్యా సంస్థల కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో మంచి ప్రతిభను కనబరచాలన్నారు. క్రీడలలో పతకాలు సాధిస్తేనే మంచి గుర్తింపు వస్తుందనే విషయాన్ని విద్యార్థులు మరువకూడదని ఆయన సూచించారు. క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి ప్రోత్సాహం అందిస్తున్నాయని, అందుకు తగ్గట్టుగానే క్రీడాకారులు కూడా చక్కని ప్రతిభను కనబరిచారన్నారు. అంతర్జాతీయంగా రాణించి డిప్యూటీ కలెక్టర్ పోస్టులు పొందిన క్రీడాకారులను నేటితరం క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పరిశీలకులు రమేష్, రాజు, టోర్నమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శులు టి విజయ వర్మ, టి శ్రీలత, శాప్ రెజ్లింగ్ కోచ్ మనోహర్, ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భూషణం, వ్యాయామ అధ్యాపకులు ఆనంద్, సీనియర్ కోచ్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అరుణ్‌కుమార్‌ని చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుంది : బుద్ధవెంకన్న

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ఉండవల్లి అరుణ్ కుమార్ను చూసి ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందని, ఆస్తులాంత హైదరాబాద్ లోనే వుంటాయన్నారు. రాజమండ్రి లో వుండవన్నారు. అవినీతిని బయట పెడతానుతను, నీతిమంతుడని నిరూపించుకోగలరా? అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న సవాల్ విసిరారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మాట్లాడుతూ చంద్రబాబుపై సీబీఐ ఎంక్వైరీ చేయాలని, వైసీపీ నాయకులు పిల్ వేయడం కక్ష సాధింపు చర్యల్లో భాగమే అన్నారు. చంద్రబాబుకు స్కిల్ డెవలప్ మెంట్ అవినీతిలో ఎటువంటి సంబంధం లేదన్నారు. కంపెనీలతో ఎటువంటి డీల్ జరగలేదని, అలాంటప్పుడు పిల్ వేయడంలో అర్థంలేదన్నారు. లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న చంద్రబాబుపై బ్లాక్ మెయిల్ రాజకీయాలు మొదలుపెట్టారని విమర్శించారు.

అంగన్వాడీల ఉద్యమంపై పోలీసుల నిర్బంధం

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): అంగన్‌వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి 25వ తేదీ తలపెట్టిన ధర్నాను విఫలంచేయడానికి ప్రభుత్వ, పోలీసు నిర్బంధాన్ని, అరెస్టులను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యయుతంగా జరిగే ధర్నాలో హింస జరుగుతుందనే తప్పుడు ప్రచారం పోలీసులు చేయడం గర్హనీయం. ఎక్కడికక్కడ ఇళ్ళవద్దనే అరెస్టులు చేసి నిర్బంధించడం, వాహనాలను అడ్డుకోవడం, ధర్నాకు అనుమతినివ్వకపోవడం అప్రజాస్వామికం. అంగన్‌వాడీ కార్మికులు తమ సమస్యలకోసం గత కొంతకాలంగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్నారు. కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి పూనుకోకుండా నిర్బంధం ప్రయోగించడం దారుణం. తమ న్యాయసమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, నిరసన తెలపడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు, ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే. రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలి. సెప్టెంబర్ 25న విజయవాడ ధర్నాకు అనుమతినివ్వాలి. వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని, అందుకు సంఘ నాయకులతో చర్చలు జరపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తూ వామపక్ష నాయకులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. సిపిఐ(యం) వి.శ్రీనివాసరరావు, సిపిఐ కె. రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ వై సాంబశివరావు, సిపిఐ (ఎంఎల్) జాస్తి కిషోర్ బాబు, ఎంసిపిఐ (యు) కాటం నాగభూషణం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఎన్ మూర్తి, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్ యు సిఐ (సి) బి ఎస్ అమర్నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ పి వి సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ జానకి రాముడు లు పత్రికా ప్రకటన పై సంతకాలు చేశారు.

వినాయక విగ్రహ ఊరేగింపు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం వినాయక నిమజ్జనం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. దీనితో ప్రధాన రహదారులు, అగ్రామాలు సందడిగా మారాయి. దీనిలో భాగంగానే పెదపూడి గ్రామంలో పిల్లలు వారం రోజులుగా నిర్వహించిన వినాయక పూజలను ముగించి నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరు ప్లాట్ ఫారం రిక్షాలో విగ్రహాన్ని పెట్టుకొని సాదాసీదాగా ఊరేగింపు నిర్వహిస్తూ యద్దనపూడి పంటకాలంలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ పిల్లలను పలువురు అభినందించారు. కాగా కూచిపూడి పెదపూడి తదితర ప్రాంతాలలో డీజే మైకులహోరులో, డప్పు వాయిద్యాల నడుమ ట్రాక్టర్ ల పై విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి కొందరు కృష్ణానదిలో, కొంతకాలంలో నిమజ్జనం చేశారు.

ఘనంగా అన్నదానాలు, నిమజ్జన ఊరేగింపులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు కూడళ్లలో విగ్రహాలకు ఆదివారం నిమజ్జన ఊరేగింపులు నిర్వహించగా, మరికొన్ని చోట్ల అన్నసమారాధన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక కమ్మటూరు, ఆర్యవైశ్య కల్యాణమండపం వద్ద పెద్దఎత్తున అన్నసమారాధనలు జరిగాయి. రాజస్థాన్ రాష్ట్రవాసులు నూజివీడు రోడ్డులో ఏర్పాటు చేసుకున్న విఘ్నేశ్వరుని విగ్రహం, ఎన్టీఆర్ కాలనీవాసులు నిమజ్జన ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

7వ రోజు నవనీత గణపతిగా దర్శనం

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆదివారం గణపతి నవరాత్రి మహోత్సవాల భాగంగా 7వ రోజు శ్రీ నవనీత గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ గంటా చంద్రశేఖర్, దేవస్థాన ఇఓ ప్రసాద్, సహాయకులు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు బంటుమిల్లి సూర్యనారాయణరావు, బొర్రా రవికుమార్, సిద్దాబత్తుల నీలవేణి, భారతి, రాధిక, తాత రజనీకుమారి, వేదపండితులు పాల్గొన్నారు.

ఘనంగా విఘ్నేశ్వరుని నిమజ్జనం

విశాలాంధ్ర-వీరులపాడు: చెన్నారావుపాలెం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని 17వ సంవత్సరాలుగా ఏర్పాటు చేసిన సందర్భంగా ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఏడు రోజులుగా విశేష పూజలు అందుకున్న విఘ్నేశ్వరున్ని గ్రామ వీధుల్లో మంగళ వాయిద్యాలతో ట్రాలీ పై ఊరేగించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో కీసర మునేరు నందు నిమజ్జనం చేశారు.

200 మంది దంపతుల పూజలు

విశాలాంధ్ర-నందిగామ : నందిగామ పట్నం వాసవి మార్కెట్ 41వ గణేష్ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు, ఆదివారం ఉత్సవాల్లో భాగంగా లోక కళ్యాణార్థం దేశ శ్రేయస్సు కాంక్షిస్తూ సీతారామచంద్ర దివ్య కళ్యాణం మహోత్సవం వేద పండితులు దివి కృష్ణమాచార్యులు, ఆదోక్షదాచార్యులు, ధన్వంతరాచార్యుల వేదమంత్రో చ్చారణ నడుమ సీతారామ దివ్య కళ్యాణం కన్నుల పండుగ జరిగింది, ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ కళ్యాణ మహోత్సవం లో 200 మంది దంపతులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.సీతారామచంద్ర దివ్య కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు.

జనసేన నేతల ముందస్తు అరెస్ట్

విశాలాంధ్ర-మంగళగిరి: జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. సదరు నిరసన కార్యక్రమానికి హాజరవుతు న్నారన్న సమాచారం నేపథ్యంలో ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ యువ జన విభాగం నాయకులు చిట్టెం అవినాష్, పార్టీ నగర కోఆర్డినేటర్ మునగపాటి మారుతీ రావులను పోలీసులు ఆదివారం సాయంత్రం ముందస్తు చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకున్నారు. ఇరువురు నాయకులకు నోటీసులు అందజేసి విడుదల చేశారు. ప్రజా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం చట్టరీత్యా నేరమని సదరు నోటీసుల్లో పేర్కొన్నారు. సదరు కార్యక్రమా నికి హాజరైతే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, నరేంద్రరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరులోని ఐఎంఏ హాల్‌లో జరి గిన సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూ రు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ నూతక్కి శ్రీనివాస్, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ నూతక్కి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వెలగా మహేష్, కారదర్శిగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ బి. సాయి కృష్ణ లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని ఐఎంఏ జిల్లా ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యద ర్శులు మాట్లాడుతూ కమిటీ అభివృద్ధికి దోహద పడటమే కాకుండా వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా పని చేస్తామని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ విభాగాల్లో వస్తున్న సాంకేతిక అభివృద్ధిని పరిచయం చేసేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని వారు స్పష్టంచేశారు.

ఛలో కలెక్టరేట్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు: ఎన్నికల్లో హామీ ఇచ్చిన సీపీఎస్ రద్దు చేయకుండా బలవంతంగా మోపుతున్న జీపీఎస్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు రేపు సోమవారం నిర్వహించే ఛలో కలెక్టరేట్ కార్యక్రమానికి ఏపీటీఎఫ్ నాయకులు శ్రేణులుఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి లు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ లు ప్రకటన లో తెలిపారు. సీపీఎస్ ను అధికారంలోకి వచ్చిన వారంలో రద్దు చేస్తామని ఉద్యోగ,ఉపాధ్యాయులు మద్దత్తు ఎన్నికల్లో పొంది అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్ళు గడిచిన సీపీఎస్ రద్దు చేయకపోయినా ఎవరూ అడగని జీపీఎస్ గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్ తీసుకురావడం ఎన్నికల్లో అండగా నిలిచిన ఉద్యోగ,ఉపాధ్యాయులు ను మోసం చేయడమేనని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీపీఎస్ ప్రతిపాదన విరమించుకుని ఒపీఎస్ అమలు పర్చి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు..

ఆటో రంగ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఆటో కార్మికుల సమస్యలను జగన్ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టీ యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పోలారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం అలంకార్ ధర్నా చౌక్ లో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆటో కార్మికుల సమస్యలపై మహాధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో రంగం పట్ల వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నదని అన్నారు. ఒకవైపున విపరీతంగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మరోవైపున తలకు మించిన భారంగా వేలకు వేల రూపాయిలు జరిమానాలు, ఈ చలానాలు, పెనాల్టీలు విధిస్తూ ఆటో కార్మికుల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్షులు దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడుతూ నగరంలో 2002లో ఆటోల పరిమితులు విధిస్తూ జారీ చేసిన జీవోను సాకుగా చూపిస్తూ నగరంలోని పాత డీజిల్ మరియు 2007 వరకు పర్మిట్లు గల సీఎన్జీ ఆటోల స్థానంలో కొత్త సిఎన్జీ ఆటోలకు ప్రొసీడింగ్స్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిపార్ట్మెంట్ ద్వారా స్క్రాప్ చేయబడ్డ ఆటోల స్థానంలో కూడా కొత్త ఆటోలకు ప్రొసీడింగ్స్ ఇవ్వలేదన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోకి విరుద్ధంగా ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు నాలుగు మండలాల ఆటోలను నగరంలోకి రాకుండా ఆంక్షలు విధిస్తూ ట్రాన్స్పోర్ట్ కమీషనర్ మెమో ఇవ్వడం న్యాయం కాదన్నారు. ఈ సమస్యలపై అనేక పర్యాయాలు అధికార్లకు వినతి ఇచ్చినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. పెద్ద ఎత్తున ఆటో కార్మికులు పాల్గొన్న ఈ ధర్నాలో ఐ.ఎఫ్. టీ.యు జిల్లా అధ్యక్షులు ముని శంకర్, ప్రధాన కార్యదర్శి ఎ.రవిచంద్ర, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.పెద్దిరాజు నాయకులు డి.శ్రీధర్, పి.రఫీ, అర్.శ్రీను, వై.అప్పారావు, యాదగిరి, పింగళి రమణ, ఎల్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.